
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త







మద్యం షాపుల వద్ద రద్దీ దృశ్యం

# న్యూ ఇయర్ జోష్

### కొత్తపడాదికి స్వాగతం పలికిన నగరవాసులు
### -పోలీసుల నిబంధనలు పట్టించుకోని జనం
### -కిటకిటలాడిన మద్యంషాపులు

**హైదరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** ఉత్సహం ఉప్పొంగింది..ఉల్లాసం ఉరకలెత్తింది.. నూతన సంవత్సర వేడుకల్లో జోష్ జోరందుకుంది. 2026కి నగర జనం సాదర స్వాగతం పలికారు. బుధవారం అర్థరాత్రి ఒంటి గంటవరకు వేడుకలతో నగరమంతా హోరెత్తిపోయింది. రాత్రి 12కావడంతోనే ఒక్కసారిగా యువతీయువకులు జాతీయ జెండాలతో రహదారులపైకి పరుగులు తీసారు. వినువీధుల్లో జాతీయ జెండాలు రెపరెపలాడుతుండగా కొత్తసంవత్సరానికి స్వాగతం పలికారు. ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. నగరమంతటా యువజనోత్సాహం వెల్లివిరిసింది. అందంగా అలంకరించిన రంగు రంగుల విద్యుద్దీపాలు, బాణా సంచా వెలుగులు జిలుగులు నగరానికి కొత్తకాంతులను అద్దాయి. మరోవైపు అర్థరాత్రి దాటిన తర్వాత కూడా రహదారులపై అనేక చోట్ల రద్దీనెలకొంది. ట్యాంక్ బండ్, నెక్లెస్‌రోడ్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్‌సిటీ, మాదాపూర్, తార్నాక , కూకట్‌పల్లి మియాపూర్, అమీర్‌పేట్, ప్రాంతాల్లో యువతీయువకులు రోడ్లపైకివచ్చి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంగులు చల్లుకున్నారు. నగరంలోని అన్ని హోటళ్లు, పబ్బులు, క్లబ్బులు, బార్అండ్ రెస్టారెంట్‌లు సంగీత నృత్యోత్సవాలతో హోరెత్తాయి. డీజెలు సృష్టించిన సంగీత హోరులో నగరవాసులు తడిసి ముద్దయా ్యరు. నగరవాసులు కొందరు కుటుంబాలతో తరలివెళ్లి శివార్లలోని రిసార్టుల్లో

మిగతా 2లో

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**మొయినాబాద్, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** బీజాపూర్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మొయినాబాద్ ఇన్స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి కథనం ప్రకారం..రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం మల్కాపూరం గ్రామానికి చెందిన చేవెళ్ల మండలం మల్కాపూరం గ్రామానికి చెందిన బక్కరెడ్డి రఘునాథ్ రెడ్డి (23) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. సురంగల్ రెవెన్యూ పరిధిలోని తాజ్‌హోటల్ సమీపంలో చేవెళ్ల నుండి హైద్రాబాద్ వస్తున్న లారీ అతివేగంతో ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన రఘునాథ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనలో మృతుని కుటుంబంతోపాటు, గ్రామంలోనూ తీవ్ర విషాదాన్ని నింపింది.



పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

## ప్రమాదం జరిగిన తొలి గంట కీలకం

### తక్షణం స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు
### బాధితులను ఆస్పత్రికి తరలించిన వారికి 25వేల నగదు బహుమతి
### రోడ్డు సేఫ్టీ మాసోత్సవాల్లోన అదనపు కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 31, ప్రభాత వార్త :** జిల్లాలోని ప్రమాదకర స్థలాలు గుర్తించాలని, ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న జాతీయ భద్రత మాసోత్సవాలలో భాగంగ జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. దీనిలో ఆయనతో పాటు రోడ్డు సేఫ్టీ డిసిపి మనోహర్ కూడ పాల్గొన్నారు. ఈ సందర్భంగ సమస్యాత్మకమైన రోడ్లు, మరమ్మతులు, అవసరమైన రోడ్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులను మొదటి గంటలోపు (గోల్డన్ అవర్) వైద్య సహాయం అందిస్తే రోడ్డు ప్రమాద మరణాలను తగ్గంచవచ్చని, చాలా వరకు తగ్గుతాయన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని మొదటి గంటలో ఆసుపత్రికి చేర్చిన వారికి 25వేల నగదు బహుమతితో పాటు (రాహ్‌వీర్) ప్రశంసపత్రాన్ని అందజేయటం జరుగుతుందన్నారు. గత సమావేశంలో ఎన్ని సమస్యలు ఎంత వరకు పరిష్కరించారు..ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నవి అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట ఎలక్ట్రిక్ పోల్స్‌ను షిఫ్ట్ చేసి రోడ్డు విస్తీర్ణం చేయాలని, రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలకు గురికాకుండ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ కుండ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ప్యాచ్ వర్క్ కాకుండ ఎక్కువగా కొత్త రోడ్లను నిర్మించాలన్నారు. రోడ్డు సేఫ్టీ డిసిపి మనోహర్

మిగతా 2లో

# నవ నగరానికి రక్షణ కవచం

## ఫ్యూచర్ సిటీకి కొత్త పోలీస్ కమిషనరేట్

### మహేశ్వరం డిసిపి జోన్.. సైబరాబాద్‌లోని షాద్‌నగర్ డివిజన్..
### రాజేంద్రనగర్ జోన్‌లోని కొన్ని పిఎస్‌లతో కలిపి మొత్తం 22 పోలీస్ స్టేషన్లు



తొలి సిపిగా సుధీర్‌బాబు

### పునర్విభజనతో రూపురేఖలు మారిన హైదరాబాద్ కమిషనరేట్

రంగారెడ్డి, **డిసెంబరు 31, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ భద్రతపై ప్రభుత్వం గట్టి కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఇక్కడ ఏకంగా ఓ పోలీస్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనికి సబంధించిన అధికారిక ఆదేశాలు కూడా పోలీసుశాఖకు అందాయి. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నుంచి ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ తొలి సిపిగా సుధీర్‌బాబు వ్యవహరించనున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పునర్విభజన తరహాలోనే.. నగర భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు పోలీసు కమిషనరేట్లనూ పునర్వ్యవస్థీకరించింది. ఇందులోభాగంగా మూడు కమిషనరేట్లకు అదనంగా.. నాలుగో కమిషనరేట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతాలన్నింటినీ జివాచ్ఎంసిలో విలీనం చేసిన నేపథ్యంలో.. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా పోలీసు శాఖలో ఈ భారీ మార్పులు చోటుచేసుకున్నాయి.

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఏర్పాటు ఈ పునర్విభజనలో ప్రధానమైన అంశం. గతంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, ఆమన్‌గల్లు వంటి ప్రాంతాలను కలిపి ఈ కొత్త కమిషనరేట్‌ను రూపొందించారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా ప్రపంచస్థాయి హబ్‌గా మారనుండటంతో అక్కడి భద్రత, శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ అవసరమని ప్రభుత్వం భావించింది. ప్రస్తుతానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే ఈ కొత్త కమిషనరేట్ కార్యకలాపాలు తాత్కాలికంగా ప్రారంభం కానున్నాయి.

ఈ కమిషనరేట్‌లో ప్రస్తుతానికి రాచకొండ పరిధిలోని మహేశ్వరం డిసిపి జోన్‌తో పాటు సైబరాబాద్‌లోని షాద్‌నగర్ డివిజన్, రాజేంద్రనగర్ జోన్‌లోని కొన్ని పోలీసు స్టేషన్లు కలిపి మొ త్తం 22 పోలీసు స్టేషన్లను కేటాయించారు.

**మల్కాజిగిరి కమిషనరేట్ పరధిలో కీసర, శామీర్‌పేట**

మరోవైపు ప్రస్తుతం ఉన్న రాచకొండ కమిషనరేట్ పేరును మల్కాజిగిరి కమిషనరేట్‌గా మార్చారు. దీని పరిధిలోకి సికింద్రాబాద్, కంటోన్మెంట్, కీసర, శామీర్‌పేట, కుత్బుల్లాపూర్, కొంపల్లి వంటి ప్రాంతాలతో పాటు బోయినపల్లి, కార్ఖానా, తిరుమలగిరి పోలీస్ స్టేషన్లను చేర్చారు. అలాగే హైదరాబాద్ కమిషనరేట్ పరిధిని అటు శంషాబాద్, ఇటు రాజేంద్రనగర్ వరకు విస్తరించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కూడా భౌగోళికంగా కొన్ని మార్పులు చేస్తూ సరిహద్దులను పునర్వ్యవస్థీకరించారు. వీటితో పాటు భువనగిరిని ప్రత్యేక పోలీస్ జిల్లాగా మార్చడం గమనార్హం.

**నగర పరిధిలో మార్పులిలా..**

సైబరాబాద్ నుంచి కొన్ని పోలీసు స్టేషన్లను హైదరాబాద్‌కు బదలాయించగా మరికొన్నింటిని హైదరాబాద్ నుంచి మల్కాజిగిరి (ఇదివరకటి రాచకొండ కమిషనరేట్) కమిషనరేట్‌లోకి మార్చారు. పాతబస్తీలోని పురానిహవేలిలో ఇప్పుడున్న దక్షిణ మండలం కార్యాలయంలో చార్మినార్ జోన్ డిసిపి విధులు నిర్వహిస్తారు. ఈ జోన్ పరిధిలో చార్మినార్, మలక్‌పేట్, మీర్‌చౌక్, సైదాబాద్, సంతోష్‌నగర్ డివిజన్లు వుండగా వీటి పరిధిలోని 16 పోలీసు స్టేషన్లు వుంటాయి. సైదాబాద్ చౌరస్తాలో గల సౌత్..ఈస్ట్ జోన్‌ను ఎత్తేశారు. మూడేళ్ల క్రితమే ఈ జోన్ ఏర్పాటవగా దీనిని తాజాగా రద్దు చేశారు. ఈ జోన్ పరిధిలోని పోలీసు స్టేషన్లను కొన్నింటిని చార్మినార్ జోన్‌లో ఇంకొన్నింటిని కొత్తగా అందుబాటులో వచ్చిన రాజేంద్రనగర్ జోన్‌లో కలిపారు.

మిగతా 2లో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

## నేరాల నిరోధానికి పూర్తి అవకాశం

### డిప్యూటి కమిషనరేట్ ఏర్పాటుపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, డిసెంబరు 31, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గ ప్రాంతం ఇక పటిష్టమైన రక్షణ వలయంగా మారబోతోందని డిప్యూటీ కమిషనరేట్ ఏర్పాటుతో పలు మార్పులు సంభవించనున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మార్పు కారణంగా నేరాల నిరోధానికి పూర్తి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఇప్పటిదాకా శంషాబాద్ పరిధిలో ఉన్న నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ మండలాలు షాద్‌నగర్ పరిధిలోకే వస్తాయన్నారు. దీనివల్ల అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దూరం అవుతాయని వెల్లడిం చారు. అదేవిధంగా కేశంపేట మండలం ఆమనగల్ ఏసీబీ పరిధిలోకి వెళ్లినట్లుగా ప్రచారం జరిగిందని, ఇది వాస్తవం కాదని అన్నారు. మొదట పోలీసు శాఖ ఆ విధంగా రూట్ మ్యాప్ ఏర్పాటు చేసినప్పటికీ తాను అభ్యంతరం చెప్పడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేశంపేట కూడా షాద్ నగర్ కమిషనరేట్ పరిధిలోకి వస్తుందని వెల్లడిం చారు. దీనివల్ల పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి విలువైన సేవలు అంది స్తారని ఆయన స్పష్టం చేశారు. షాద్ నగర్ పారిశ్రామిక ప్రాంతంగా, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెంది ఉండటం వల్ల నేరాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అదేవిధంగా 44వ నెంబరు జాతీయ రహదారి ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కూడా ఆస్కారం ఎక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ మరింత పటిష్టం

మిగతా 2లో



### విద్యుత్ శాఖ కార్యాలయం
## చుట్టూ దుర్గంధం
### మురుగు కాలువల వ్యవస్థపై మున్సిపాలిటీ నిర్లక్ష్య ఫలితం

**షాద్‌నగర్, డిసెంబరు 31, ప్రభాతవార్త :** షాద్‌నగర్‌లో తమ కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా ఉంచుకున్న మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది ఇతర కార్యాలయాల ఇబ్బందిని మాత్రం పట్టించుకోవడం లేదు. దీనితో ఎక్కడెక్కడ నుంచో కాలువలా వస్తున్న మురుగు నేరుగా వచ్చి షాద్‌నగర్ పరిగి రోడ్డులో గల విద్యుత్ శాఖ కార్యాలయంలోకి చేరుతుంది. ఇక్కడ అడుగుపెట్టిన దుర్గంధమయమైన పరిస్థితులు ఉండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు దుర్గంధాన్ని భరించలేక సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయంలోకి అడుగుపెట్టి చీదరింపు కొడుతున్న వినియోగదారులు మున్సిపల్ కమిషనర్ గారు ఇది న్యాయమేనా అంటూ నిలదీస్తున్నారు. సమీపంలో కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పైకాలనీల నుంచి మురుగు వరదలా వచ్చి ఈ కార్యాలయంలోకి చేరుతుంది. దీనితో కార్యాలయం అంతా దుర్గంధ మయంగా మారుతోంది. కాలువల వ్యవస్థపై మున్సిపాలిటీ శ్రద్ధ చూపక పోవడం వల్లనే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని విద్యుత్ శాఖ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఈ సమస్య నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు. ఈ వ్యవహారం పై పట్టణ ఏఈ వినోద్ మీడియాతో మాట్లాడుతూ దుర్గంధం ఏమైనా ఈ ప్రాంతంలో కనీసం ఉద్యోగం చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో మున్సిపల్ కమిషనర్ అదే విధంగా ఇతర కార్యాలయ సిబ్బందికి ఎన్నిసార్లు తమ ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని తమ సమస్య పరిష్కారం కావడంలేదని దీంతో ఇప్పుడు కార్యాలయం మొత్తం దుర్గంధమయమై ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోయిందని ఆయన ఎవరు పట్టించుకోవడంలేదని ఆవేదన చెందారు. తాము మున్సిపాలిటీకి సంబంధించిన అనేక విద్యుత్‌కు సంబంధించిన పనులు చేస్తున్నామని ఎంత సహకరిస్తున్నామని కానీ తమకు మాత్రం ఏ మాత్రం వారు సహకరించడం లేదని ఏ ఈ వినోద్ ఆందోళన వ్యక్తం చేశారు.



పేరుకుపోయిన మురుగునీరు

## నూతన సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలుండాలి

### కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 31, ప్రభాతవార్త :** జిల్లా ప్రజలు నూతన సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ మనుచౌదరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో లక్ష్యాలను ఏర్పరుచుకొని ప్రణాళికబద్ధంగ వాటిని సాధించేలా ముందుకు సాగాలని జిల్లా ప్రజలకు సూచించారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. 2026సంవత్సరంలో కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలతో, మంచి ఆశయాలతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మరింత ఉన్నతాశయాలను ఏర్పరుచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. కొత్త సంవత్సరం వేడుకలను సంయమనంతో జరుపుకోవాలని సుఖసంతోషాలతో ఉండాలని, కొత్త ఏడాదిలో ఎల్లవేళలా అందరికి మంచి జరగాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆకాంక్షించారు.



## తాగునీటి కష్టాలకు చెక్

### పైపులైన్‌లకు మరమ్మతులు- శిథిలమైనవి తొలగించి కొత్తవి పునరుద్ధరణ
### మండుటెండలోనూ నీటి కొరత రానీయనని సర్పంచ్ హామీ
### 'అక్కడ చేదుడు బావులే దిక్కు' వార్తకు స్పందన

2

## డిజేలు, అసభ్య ప్రవర్తనపై ప్రత్యేక నిఘా : ఎస్‌పి

**వికారాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త :** నూతన సంవత్సర వేడుకలపై పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి పోలీసు అధికారులతో జూమ్ సమావేశం ద్వారా నూతన సంవత్సర వేడుకల బందోబస్తు ను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా పోలీస్ అధికారులు వేడుకల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్య కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. బహిరంగ మద్యపానం, అతివేగం, అ నుమతి లేని డిజేలు, అసభ్య ప్రవర్తనపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. మహిళల రక్షణ కోసం షీ-టీమ్స్ ను, బైక్ రేసింగ్‌ల నివారణకు పెట్రోలింగ్ బృందాల ు రంగంలోకి దించినట్లు తెలిపారు. రిసార్ట్స్ నిర్వాహకులు అతిథుల వివరాల ు రికార్డు చేయాలని, నిర్దేశించిన సమయం దాటిన తర్వాత వేడుకలకు అ నుమతి లేదని స్పష్టం చేశారు.

# గడ్కరీ టెర్రర్

## ఎన్‌హెచ్ అథారిటీ అధికారుల హైరానా



### స్పీడ్ పెంచిన మహబూబ్‌నగర్ - చించోలి జాతీయ రహదారి పనులు
### 18న తాండూరుకు గడ్కరీ టూర్?
### కేంద్రమంత్రి రాక సమాచారంతో ఉన్నతాధికారుల్లో అలజడి
### రహదారి పనుల్లో జాప్యంపై నాగునెలల క్రితమే క్లాస్
### నెలనెలా వేతనాలు తీసుకుంటున్నా పనులెందుకు సాగవంటూ మంత్రి కన్నెర్ర
### వెంటనే కొడంగల్-తాండూరు వరకు వేగం పెంచిన అధికారులు
### తాజాగా గడ్కరీ పర్యటన సమాచారంతో కర్ణాటక సరిహద్దు వరకూ పనుల జోరు పెంపు
### ఇప్పటికీ 50 శాతమే పూర్తి - రూ.100 కోట్ల చెల్లింపులు

**(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)**

మహబూబ్‌నగర్ - చించోలి జాతీయ రహదారి పనులు ఎట్టకేలకు పుంజుకున్నాయి. మూడేండ్లుగా సాగదీస్తున్న పనులు ఒక్కసారిగా వేగం పెంచడానికి కారణాలూ ఉన్నాయి. జనవరి 18న కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితీన్‌గడ్కరీ తాండూరుకు విచ్చేస్తున్నారు. జినుగుర్తి గ్రామం వద్ద ఏకలవ్య ఫౌండేషన్‌లో ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు సమాచారం. సంగారెడ్డి నుంచి రోడ్డు మార్గాన వస్తున్నట్లు తెలిసింది. ఇది పసిగట్టిన జాతీయ రహదారుల అథారిటీ ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ పనుల్లో వేగం పెంచారని అనుకుంటున్నారు. నాలుగు నెలల క్రితమే ఇవే పనుల జాప్యంపై ఉన్నతాధికారులపై గడ్కరీ కన్నెర్రజేశారు. నెలనెలా వేతనాలు తీసుకుంటున్నా పనులెందుకు సాగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా కొడంగల్ నుంచి తాండూరు వరకు కాస్త వేగం పెంచిన అధికారులు మూడు రోజులుగా కర్ణాటక సరిహద్దు వరకూ జోరు పెంచారు. దీనిపై స్థానిక ప్రజానీకం ఒకింత ఆశ్చర్యం, ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రమంత్రి గడ్కరీ రాక అనే విషయం చాలామందికి తెలియదు. బూత్‌పూర్ నుంచి కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు ఎన్‌హెచ్ 167 జాతీయ రహదారిగా గుర్తించారు. అప్పట్లోనే గడ్కరీ చొరవ తీసుకుని రూ.703 కోట్లు మంజూరు చేశారు. సుమారు 96 కిలోమీటర్ల పనులు ప్రారంభించారు. మహబూబ్‌నగర్ నుంచి కొడంగల్ నియోజకవర్గం దుద్యాల వరకు మూడులైన్ల రహదారి పనులు పూర్తి చేశారు. పర్సాపూర్ వద్ద ఇంకా కొంత పనులు చేపట్టాలి. దుద్యాల నుంచి కొడంగల్, తాండూరు మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు 42 కిలోమీటర్ల మేరకు నాలుగు లేన్లు చేపడుతున్నారు.

**పెండింగ్ పనులు ఇవే..**

ఇప్పటి వరకు సుమారు 50 శాతం పనులు పూర్తి చేశారు. 22 కిలోమీటర్ల మేరకు పూర్తి చేసిన కాంట్రాక్టర్ మరో 20 కిలోమీటర్ల పనులు పెండింగులో ఉన్నాయి. ఎస్ఎంసీ ఇన్‌ఫ్రా సంస్థ కాంట్రాక్టర్ రూ.300 కోట్లకు పనులు దక్కించుకున్నారు. తాండూరు మండలం కొత్లాపూర్ వరకు మార్గమధ్యలో కల్వర్టులు పూర్తి చేయలేదు. దుమ్ముధూళితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంతో పోల్చుకుంటే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత వాహనదారులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు కూడా జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటి వరకు రూ.100 కోట్ల వరకు బిల్లులు చెల్లించినట్లు సమాచారం. తాండూరు వద్ద పెద్ద వంతెన, బైపాస్ నిర్మాణం, రైల్వేఫ్లైఓవర్, కొడంగల్‌లో వద్ద అండర్ పాస్ పనులు పెండింగులో ఉన్నాయి. మరో యేడాదిలోగా పూర్తి చేయిస్తామని జాతీయ రహదారుల అథారిటీ ఇంజనీరు సురేంద్ర వెల్లడించారు. తాండూరు బైపాస్ కోసం భూసేకరణ పూర్తి చేశామని తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా 95 శాతం మంది రైతులకు నష్టపరిహారం కూడా పూర్తి చేశారు. అల్లాపూర్, సిరిగిరిపేట, జినుగుర్తి పరిసరాలలో పనులు వేగ మంతం చేశారు. సిరిగిరిపేట వద్ద టోల్‌గేటు ఏర్పాటు చేయనున్నారు.



యంత్రాలతో పనులు వేగవంతం చేస్తున్న దృశ్యం



ఇంకా పెండిగులో ఉన్న కల్వర్టు



ఎదులాబాద్‌లో గోదారంగనాయకస్వామి తెప్పోత్సవానికి సిద్ధమవుతున్న పుష్కరిణి

## నేడు పుష్కరిణిలో తెప్పోత్సవం

**ఘట్‌కేసర్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేతమన్నార్‌రంగనాయకస్వామి ఆలయంలో గురువారం తెప్పోత్సవం జరుగనుంది. ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్తలు ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి నిత్యం గోదాదేవికి పూజలతో భక్తి, అధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలోని కోనేరులో అమ్మవారి తెప్పోత్సవం జరుగుతుందని ధర్మకర్తలు తెలిపారు. ఈమేరకు ఆలయ ధర్మకర్తలు పుష్కరిణిని శుభ్రం చేయించి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరిణిని అలంకరించి స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు వేదపండితుల మంత్రోచ్చారణాలతో తెప్పోత్సవం నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ధర్మకర్తలు కోరారు.

## ప్రజలకు అంకితభావంతో సేవలందించాలి: వజ్రేశ్




మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్

**ఘట్‌కేసర్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** ప్రజాసమస్యల పరిష్కారానికి అంకితభావంతో సేవలు అందించాలని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. జిహెచ్‌ఎంసీ ఘట్‌కేసర్ శివారెడ్డిగూడలోని బంధన్ పంక్షన్‌హాలులో డెమోక్రాటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (డిఎస్‌సిడబ్ల్యుఏ) నూతన కార్యవర్గ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వజ్రేశ్‌యాదవవ్ ముఖ్యఅతిధిగా విచ్చేసి మాట్లాడుతూ అసోసియేషన్ ప్రజలకు తమ వంతు సేవలందించాలని సూచించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఆయన అభినందించగా నిర్వహకులు విచ్చేసిన నాయకులను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, డిఎస్‌సిడబ్ల్యుఏ అధ్యక్షులు తోట రంగయ్య, ప్రధానకార్యదర్శి వేణుమాధవ్, ఉపాధ్యక్షులు ముత్యాలుగౌడ్, సోమయ్య, ఇన్నారెడ్డి, కృష్ణగౌడ్, పోచిరెడ్డి, కృష్ణమూర్తి, బసవప్ప, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ సర్కిల్ డిసి వాణికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, కాలనీల అధ్యక్షులు

## నీటి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని డిసికి వినతి

**ఘట్‌కేసర్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసీ ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక కాలనీ నాయకులతో కలిసి ఆయన సర్కిల్ కార్యాలయంలో డీసీని మర్యాదపూర్వకంగా కలిసి ప్రజా సమస్యలను వివరించారు. ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలో ఉన్న పలు కాలనీలలో జనాభా పెరుగుతుండటంతో మంచినీటి సమస్య నెలకొందని నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. గాంధీనగర్, బాలాజీనగర్, ద్వారకానగర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, పటేల్‌నగర్, సానాకాలనీ, వేమనానగర్, మేడపాటినగర్, సుశాంత్‌నగర్, కొండాపూర్ సంఘ మిత్రకాలనీ, దత్తాత్రేయనగర్, పరమేశ్వరీనగర్, ఎన్‌ఎఫ్‌సీకాలనీ, ప్రశాంత్‌నగర్, మారుతీనగర్, శివారెడ్డిగూడ, మైసమ్మగుట్టకాలనీ ప్రజలు నీటి కొరతతో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పలు చోట్ల నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావడం ద్వారా, అవసరమైన చోట్ల నీటి పైపు కనెక్షన్లు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఆయా కాలనీల్లో డ్రైనేజీ నిర్మాణం లేక ఇబ్బందులు పడుతున్నారని అవసరమైన డ్రైనేజీ ఏర్పాటు చేసి సిమెంట్, బీటీ రోడ్ల నిర్మాణం చేయాలని ఆయన కోరారు. కొండాపూర్ లేక్‌వ్యూ వెంచర్ వద్ద ఉన్న డంపింగ్‌యార్డ్‌తో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చెత్తను కుప్పలుగా పోసి కాల్చడం, ఎక్కడి చెత్త అక్కడే నిప్పంటిచండంతో గాలలి కాలుష్యం పెరుగుతుందని సమీపంలోని హెచ్‌పిసిఎల్ కంపెనీకి ప్రమాదం జరిగే ఆస్కారముందని, డంపింగ్‌యార్డు చెత్తను రీసైకిల్, క్రమపద్ధతితో సాక్రియేషన్ చేయించాలని ఆయన డీసీకి విజ్ఞప్తి చేశారు.



విద్యార్థి శివగణేశ్‌ను అభినందిస్తున్న డైరక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్

## కెపిఆర్‌ఐటి విద్యార్థికి గిన్నిస్ రికార్డ్ సాధనపై అభినందన

**ఘట్‌కేసర్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంపీ ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాలలో బిటెక్ 4వ సంవత్సరం చదువుతున్న (ఎఐ-ఎంఎల్) విద్యార్థి శివగణేశ్ తాలికోట గిన్నిస్ వరల్డ్ సాధన భాగస్వామిగా నిలిచారు. గూగుల్ ఫర్ డవలపర్స్-గూగుల్ డవలపర్స్ గ్రూప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎజెంటిక్ ఏఐ హ్యాకథాన్ 'ద మోస్ట్ పార్టిసిపెంట్స్ ఇన్ ఆన్ ఎజెంటిక్ ఈప్రపంచ రికార్డు ఈనెల 21న హైదరాబాద్‌లలో సాధించారు. ఈసందర్భంగా కళాశాల డైరక్టర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ విద్యార్థి శివగణేశ్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయస్థాయి విజయాలు సాధించాలని ఆకాక్షించారు. కేపీఆర్‌ఐటీ చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, స్ట్రాటజీ డైరక్టర్ దివ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాథ్ కశ్యప్, ఏఐ-ఎంఎల్ విభాగాధిపతి సత్యనారాయణ, పలు విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు శివగణేశను అభినందించారు.

వార్త ఎఫెక్ట్..

# నీటి సమస్యకి చెక్‌పెట్టిన సర్పంచ్

**-పనులు చేపట్టడంతో గ్రామ ప్రజల హర్షం**

**బంట్వారం, డిసెంబరు 31. ప్రభాతవార్త:** గత సోమవారం మంచినీటి సమస్యపై 'వార్త' దినపత్రికలో 'అక్కడ చేదుడు బావులే దిక్కు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ విషయమై బంట్వారం గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన డి.మల్లేశం స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు బుధవారం పనులు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో ధ్వంసమైన మంచినీటి పైప్ లైన్‌లను తవ్వించి వాటి స్థానంలో నూతన పైప్ లైన్ వేసే ప్రక్రియను మొదలు పెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేశం మాట్లాడుతూ, గ్రామంలో మంచి నీటి ఎద్దడిని నివారించేందుకు మొదటి ప్రాధాన్యతగా మంచినీటి పైప్ లైన్‌లు వేయడం, మంచినీటి నిల్వ ఉండే ట్యాంకుల నిర్మాణాలు చేపట్టేందుకు కృషి



మంచి నీటి సరఫరా పైప్ లైన్ పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

చేస్తున్నట్లు తెలిపారు. మండు వేసవిలో సైతం నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు గ్రామంలో ఉన్న మంచి నీటి బావిల నుంచి బోరు మోటార్లు ఏర్పాటు చేసి అట్టి నీటిని మినీ ట్యాంకులోకి సరఫరా చేసి ఎల్లప్పుడు మంచినీటిని గ్రామంలోని కాలనీ వాసులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి, పారిశుద్య పనులు చేయిస్తానని పేర్కొన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

## హైదరాబాద్ డిసిసి పునర్వ్యవస్థీకరణ...ఆన్‌లైన్ దరఖాస్తు పోర్టల్ ప్రారంభం

**చార్మినార్,డిసెంబరు 31 ప్రభాతవార్త :** హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి (డిసిసి)కి కొత్తగా 45 మంది సభ్యులతో కూడ న నిర్మాణాన్ని ప్రకటించిందని,ఆసక్తి ఉన్న అభ్యర్థుల కోసం ఆన్‌లైన్ ధరఖాస్తు ప్రక్రియను కూడ ప్రారంభించామని హైదరా బాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపు ల్లా తెలిపారు.బుధవారం జరిగిన సమావేశంలో ఆయనతో పాటు హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి పరిశీలకులు మహ్మద్ జావిద్,సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ విలువలకు కటుబడి,అంకిత భావతంతో పని చేసే వారిని కోరుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని చార్మినార్,బహదూర్‌పుర, చాంద్రాయ ణగుట్ట,యాకుత్‌పుర, మలక్‌పేట్ నియోజకవర్గాలలో ఒకటి కోశాధికారి,ఐదు ప్రతినిధులు,పది ఉపాధ్యక్షులు,తొమ్మిది కార్యదర్శులు,15 మంది కార్య నిర్వాహక కమిటి సభ్యులు ఉంటారని ఆయన తెలియజేశారు.కోర్ కమిటితో పాటు 44 మంది డివిజన్ అధ్యక్షులను కూడ నియమించనున్నామని ఆ యన తెలిపారు.ఎంపిక ప్రక్రియను సులభతరం చేయటానికి, ఎక్కువ మంది పాల్గొనేలా చేయటానికి ఆన్‌లైన్ ధరాఖాస్తు పోర్టల్‌ను ప్రారంభించామని ఆయన తెలియజేశారు. ధరఖాస్తు లు హెచ్‌టిటిపిఎస్:// జాయిన్ హైదరాబాద్



సమావేశంలో పాల్గొన్న హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి పరిశీలకులు మహ్మద్ జావిద్,సుబ్రహ్మణ్యం,హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా

కాంగ్రెస్. ఇన్/డి సిసికి జనవరి నాలుగువ తేదీ లోగా కార్యకర్తలు ధరఖాస్తులు చేయాలని ఆయన కోరారు.జిల్లా కాంగ్రెస్ కమిటి పరిశీలకులు మహ్మద్ జావిద్,సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ డిసిసి పునర్వ వ్యవస్థీకరణలో మహిళలతో పాటు అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బహదూర్‌పుర, చార్మినార్, యాకుత్ పుర, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీల ఇంఛార్జిలు పులిపాటి రాజేష్ కుమార్,ముజీబుల్లా షరీఫ్,కె.రవిరాజ్,బోయ నరేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అసైనీదారులకు భూమియాజమాన్య హక్కులు కల్పించాలి

**-వరంగల్ డిక్లరేషన్ అమలు చేయండి: గోవర్ధన్**

**ఘట్‌కేసర్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** వరంగల్ డిక్లరేషన్‌లో చేసిన వాగ్దానం మేరకు అసైనీభూములు కల్గిన రైతులకు భూమి యాజమాన్య హక్కులు కల్పించాలని ఏబీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత రెడ్డి గత రెండు సంవత్సరాల క్రితం వరంగల్ డిక్లరేషన్‌లో అసైనీభూమి కల్గిన రైతులకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పిస్తామని హమీ ఇచ్చారని, ప్రస్తుత శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో అసైనీభూముల బిల్లును ప్రవేశపెట్టి తన వాగ్దానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 24 లక్షల ఎకరాల అసైనీ భూమి ఉందని రైతులకు హక్కులు కల్పిస్తే వారికి ప్రయోజనం కల్గుతుందని, రైతులను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకోవాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో కొర్రెముల బిజెపి నాయకులు పోలగోని మహేశ్‌గౌడ్, రైతులు బైండ్ల వజ్రమ్మ, రవీందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ ఇయర్ జోష్

(మొదటి పేజీ తరువాయి)

నూతన సంవత్సర వేడుకల్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్తసంవత్సరవేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టిబందోబస్తును ఏర్పాటు చేశారు.నగరంలోని అన్నిఫ్లైఓవర్‌లను మూసివేసారు. విస్తృతంగా డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహించారు. ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన బందోబస్తును నిర్వహించారు.

**కొనుగోలు దారులతో కిటకిటలాడిన బేకరీలు..**

న్యూఇయర్ వేడుకల సందర్భంగా నగరంలోని బేకరీలన్నీ కిటకిటలాడాయి. బిర్యానీ సెంటర్లు..బేకరీలముందు భారీగా క్యూలైన్లు దర్శనమిచ్చాయి. నగరవ్యాప్తంగా పలు బేకరీలు ముందు కౌంటర్లు ఏర్పాటు చేసి వేలసంఖ్యలో కేకు అమ్మకాలు జరిపారు. విభిన్న రకాలుగా తయారుచేసిన కేక్‌లను కొనేందుకు యువత ఉత్సాహం చూపించారు. డిసెంబరు 31నేపథ్యంలో బేకరీల నిర్వాహకులు వారంరోజుల ముందునుండే ప్రత్యేక ఏరాట్లు చేశారు.

**బయట ఫుడ్‌కే అధిక ప్రాధాన్యత..**

భాగ్యనగర వాసులు బయటఫుడ్‌కే ఎక్కువ మక్కువ చూపారు. డిసెంబరు 31వేడుకల నేపథ్యంలో నగరంలోని హోటళ్ల రెస్టారెంట్లు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించడంతో జనం వాటిబాట పట్టారు. సాయంత్రం నుండి అర్థరాత్రి వరకు పలుహోటళ్లు,రెస్టారెంట్లు కస్టమర్లతో కిటకిటలాడాయి. రోజూ ఇళ్లలోతినే రుచులకు భిన్నంగా నగరవాసులు జైకొట్టారు. పలుహోటళ్లు,బిర్యాణీ సెంటర్ల ముందు కౌంటర్లు ఏర్పాటు చేసి ఫ్యామిలీ,జంబోప్యాక్‌లుగా అమ్మారు.పలుహోటళ్ల ముందు ఫుడ్‌పార్సిల్ కోసం జనం క్యూకట్టారు.

**ఏరులై పారిన మద్యం..**

న్యూఇయర్ ఈవెంట్లు,పబ్బులు,ఫాంహౌస్‌ల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఉండటంతోపాటు బార్లు, వైన్స్, షాపులకు అర్థరాత్రి వరకు పర్మిషన్ ఇవ్వడంతోనే గ్రేటర్‌లో మద్యం అమ్మకాలు జోరుగాసాగాయి. గత ఏడాదికంటే ఎక్కువశాతమే అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలుపుతున్నారు. గ్రేటర్ పరిధిలో 350 మద్యం దుకాణాలు 246 బార్లు ,25 పబ్‌లు ఉన్నాయి. గత నాలుగు రోజులుగా గ్రేటర్ పరిధిలోని మద్యం దుకాణాలు,బార్‌లలో అమ్మకాలు రెట్టింపయ్యాయని. సాధారణ రోజుల్లో మద్యం అమ్మకాలు తక్కువగా ఉన్నా , సోమ, మంగళ,బుధ వారాల్లో ఎక్కువగా జరిగాయని వ్యాపారులు తెలుపుతున్నారు. న్యూఇయర్ సందర్భంగా అదనపు సమయం ఇచ్చిన నేపథ్యంలో అమ్మకాలు మరింత జోరుగా సాగాయి.అర్థరాత్రి వరకు చాలామంది మందుబాబులు బార్లు,రెస్టారెంట్లలో బారులుతీరారు. పాత సంవత్సర చివరి రోజైన బుధవారం మధ్యాహ్నం నుండే చాలామంది మందుబాబులు బార్లలో,వైన్స్‌ల్లో కనిపించారు..మద్యం తాగే దుకాణాల దగ్గర అన్ని వసతులతో కూడిన గదులు, రకరకాల ఫుడ్‌ఐటమ్ ఆఫర్లు ప్రకటించడంతో ఎక్కువమంది బార్లు రెస్టారెంట్లలోనే

## రోడ్డు ప్రమాదాల నివారణకు కోసం 116పద్యాలతో బండి శతకం పుస్తకావిష్కరణ

**బేగంపేట డిశంబరు 31,ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతరం కృషిచేస్తూ వినూత్న రీతిలో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తూ ముందు కు సాగుతున్న సర్వేజనా ఫౌండేషన్ నూతన సంవత్సరం సందర్భంగా వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం 116శతక పద్యాలతో రచించిన బండి శతకాన్ని సర్వేజనా ఫౌండేషన్ ఛైర్మన్ డా.ఏ.వి. గురవారెడ్డి ఆవిష్కరించారు.బుధవారం బేగంపేట లో ఈ పుస్తకావిష్కరణ చేసారు.ప్రముఖ హాస్య బ్రహ్మ శంకర్ నారాయణ, హెల్మెట్,సీటుబెల్ట్ ధరించకుండా వాహన దారులు వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు అనే అంశంపై 116పద్యాలతో సామాజిక సందేశాన్ని అందించే విధంగా రూపొందించిన ఈ పుస్తకం రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడికి అందేలా చేస్తామని గురవారెడ్డి తెలియ జేసారు.ఈ సందర్భంగా సర్వేజనా ఫౌండేషన్ సీఈఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గంభీరమైన అంశాలకు హాస్యం జోడించి మనస్సులను మార్చే ప్రక్రియలో భాగమే పుస్తక రూపమని తెలిపారు .

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

**-పోలీసుల తనిఖీలు**

**ఘట్‌కేసర్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం రాత్రి ప్రజలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఘట్‌కేసర్ పట్టణంతో పాటు కాలనీల్లో చిన్నా పెద్దా సంబరాలను ఎంతో వేడుకగా నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. అర్ధరాత్రి 2025 సంవత్సరానికి వీడ్కోలు చెప్పి 2026 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి కేక్‌లు కట్‌చేసి అందరికి పంచిపెట్టి ఆనందాన్ని పంచుకున్నారు. పోన్ ద్వారా హప్పి న్యూఈయర్ అంటూ సోషల్ మీడియా ద్వారా సందేశాలను పంపుతూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్, ఘణాపూర్, కొండాపూర్, మాదారం, అవుషాపూర్, అంకుశాపూర్, మర్రిపల్లిగూడ, ఎన్‌ఎఫ్‌సినగర్, బొక్కోనిగూడ, చందుపట్లగూడ తదితర చోట్ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రైవేటు హస్టళ్లు, బేకరీలు, రెస్టారెంట్‌లలో యువతీ, యువకులు వేడుకలు జరుపుకొని కేక్‌కట్ చేసి తినిపించుకున్నారు. యువకులు, విద్యార్థులు సౌండ్‌సిస్టిమ్‌తో పాటలు వింటూ నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. మద్యం దుకాణాలు, బార్లు మందుబాబులతో కిటకిటలాడాయి. మద్యం అమ్మకాలు గతంలో కంటే రెట్టింపు అయ్యాయి. ఘట్‌కేసర్‌లో మాంసం, చికెన్, చేపలు, శీతల పానియాలు, కేకుల విక్రయాలు జోరుగా జరిగాయి. ఘట్‌కేసర్ పట్టణంలో కేక్‌ల దుకాణాలు ఏర్పాటు చేసి కిలో కేక్ 400 నుంచి 700 రుపాయల చొప్పున అమ్మారు. ఘట్‌కేసర్ బైపాస్ రహదారి చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు



ఘట్‌కేసర్‌లో కేక్‌కట్ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, డాక్టర్ మల్లేశ్

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి మద్యం తాగి వాహనం నడిపిన వారికి జరిమానా విధించారు. ఘట్‌కేసర్‌లో రాత్రి జరిగిన ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ పాల్గొని కేక్‌కట్ చేశారు. ఈసందర్భంగా ఆమె మున్సిపల్ సర్కిల్ ప్రజలకు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలందరికి 2026 నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంఆర్‌పిఎస్-టిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మీసాల మల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో మాజీ సర్పంచులు పోతబత్తిని స్టీవెన్, నల్లొళ్ల యాదగిరి, మాజీ కౌన్సిలర్లు కడుపొల్ల మల్లేశ్, మాజీ ఉపసర్పంచ్ రాజబోయిన యాదగిరియాదవ్, ఆర్‌బిఎస్ జిల్లా మాజీ సభ్యులు చిలుగూరి మంకయ్య, మాజీ వార్డుసభ్యులు గుర్జకుంట నర్సింహ్మా, నాయకులు మోత్కుపల్లి శ్రీనివాస్, నాగులపల్లి శ్రీనివాస్, ఎర్రోళ్ల సత్యనారాయణ, చిలుగూరి రవి, భగవంతరావు, కడుపొల్ల రాజు, గ్యార అంజనేయులు, కృష్ణ, సత్యనారాయణ, సుధాకర్, గణేశగౌడ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నవ నగరానికి రక్షణ కవచం

(మొదటి పేజీ తరువాయి)

మొహదీపట్నం చౌరస్తాలో గల దక్షిణ, పశ్చిమ డిసిపి కార్యాలయం నుంచి గోల్కొండ జోన్ ఏర్పాటవనుండగా ఇక్కడి నుంచి డిసిపి విధులు నిర్వహిస్తారు. ఈ జోన్‌లో ఆసిఫ్‌నగర్, గోషామహల్, కుల్సుంపురా, టోలిచౌకి డివిజన్లు వుండగా వీటి పరిధిలోని 14 పోలీసు స్టేషన్లు వుంటాయి. ఖైరతాబాద్ 1 జోన్ ఎసి గార్డ్స్ వద్ద గల పశ్చిమ మండల కార్యాలయం నుంచి పనిచేయనుంది. ఈ జోన్ పరిధిలో బంజా రాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్ నగర్ డివిజన్లు వుండగా వీటి పరిధిలోని ఏడు పోలీసు స్టేషన్లు వుంటాయి. ఖైరతాబాద్ 2 జోన్ కార్యాలయం పబ్లిక్ గార్డెన్స్ వద్ద గల సెంట్రల్ జోన్ కార్యాలయం నుంచి పనిచేయనుంది. ఈ జోన్ పరిధిలో అబిడ్స్, పంజాగుట్ట, సైఫాబాద్, సుల్తాన్‌బజార్ డివిజన్లు వుండగా వీటి పరిధిలోని ఎనిమిది పోలీసు స్టేషన్లు వుంటాయి. సైబరాబాద్‌లో ఇప్పటి వరకు కొనసాగి తాజాగా హైదరాబాద్‌లో విలీనమైన రాజేంద్రనగర్ జోన్‌లో హైదరాబాద్ పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, ఇదివరకు సైబరాబాద్‌లో వున్న రాజేంద్రనర్ డివిజన్లు వీటి పరిధిలోని పది పోలీసు స్టేషన్లు వుంటాయి. ఈ జోన్ రాజేంద్రనగర్ వెటర్నరీ కాలేజిలో గల రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయం నుంచి పనిచేస్తుంది. సైబరాబాద్ పరిధిలో ఇంతకాలం వున్న శంషాబాద్ జోన్ హై దరాబాద్‌లో విలీనం కాగా ఇందులోని ఆర్‌జిఐఎ, ఆదిబట్ల డివిజన్‌లు వీటి పరిధిలోని ఐదు పోలీసు స్టేషన్లు వుంటాయి. ఈ జోన్ శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీసు స్టేషన్‌లోని శంషాబాద్ డిసిపి కేంద్రం నుంచి పనిచేస్తుంది. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఇదే బుల్లి జోన్. శంషాబాద్ విమానాశ్రయంతో సమీప గ్రామాలు ఈ జోన్ పరిధిలో వుంటాయి. కాగా సికింద్రాబాద్ పేరిట ఏర్పాటైన కొత్త జోన్ అంబర్‌పేట్‌లో గల తూర్పు మండల కార్యాలయం నుంచి పనిచేసే వీలుంది. ఈ జోన్ పరిధిలో చిక్కడపల్లి, చిలకలగూడ, గాంధీనగర్, మహంకాళి, ఉస్మానియా వర్శిటీ డివిజన్లతో పాటు వీటి పరిధిలోని 14 పోలీసు స్టేషన్లు వుంటాయి. ఇక ఇంతకాలం హైదరాబాద్ కమిషనరేట్‌లో వున్న బేగంపేట్, తిరుమల్‌గిరి, తుకారంగేట్, కార్ఖాన, మారెడ్‌పల్లి పోలీసు స్టేషన్లు మల్కాజిగిరి కమిషనరేట్‌కు బదలాయించారు. ఇక సైబరాబాద్‌లో ఇంతకాలం కొనసాగిన మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల సహా మరో రెండు పోలీసు స్టేషన్లు కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లో విలీనం అయ్యాయి. సంగారెడ్డి పరిధిలోని పటాన్‌చెరు డివిజన్‌లో గల కొన్ని పోలీసు స్టేషన్లు సైబరాబాద్‌కు, సైబరాబాద్ పరిధిలో ఇంతకాలం వున్న మేడ్చల్ జోన్‌లోని మరికొన్ని పోలీసు స్టేషన్లు మల్కాజిగిరి కమిషన రేట్‌లో మారాయి. సైబరాబాద్ కమిషనరేట్ ఇప్పుడున్నట్లుగానే గచ్చిబౌలిలో, మల్కాజిగిరి కమిషనరేట్ ఏఎస్‌రావు నగర్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో కొనసాగనుంది. ఈ రెండు కమిషనరేట్లలో మూడేసి జోన్లు వుండనున్నాయి.

**హైదరాబాద్ పరిధిలోని పోలీసు స్టేషన్ల తొలగింపుపై వివాదం**

ఇదిలావుండగా ఇంతకాలం హైదరాబాద్ పరిధిలో వున్న బేగంపేట్, తిరుమల్‌గిరి, కార్ఖానా, మారెడ్‌పల్లి, తుకారంగేట్ పోలీసు స్టేషన్లు ఇకముందు మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో వుంటాయి. ఇందులో ఇతర పోలీసు స్టేషన్ల సంగతి ఎలావున్నా బేగంపేట్ హైద రాబాద్‌లోనే వుండగా విమానాశ్రయం కూడా ఇక్కడే వుంది. ఎక్కడో శంషాబాద్‌లో వున్న విమానాశ్రయ భద్రతను హైదరాబాద్ పరిధిలోకి తెచ్చిన సర్కారు బేగంపేట్‌ను మల్కాజిగిరిలో విలీనం చేయడం గమనార్హం. దీంతో పాటు దీని పక్కనే వున్న తుకారంగేట్ సహా ఇతర పోలీసు స్టేషన్ల మార్పుపైనా ఆయా బస్తీల ప్రజలు అసంతృప్తితో వున్నారు.

## నేరాల నిరోధానికి పూర్తి అవకాశం

(మొదటిపేజీ తరువాయి)

కావడం వల్ల నేరాలను, ఘోరాలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాన్ని నేరాలకు దూరంగా ప్రశాంతంగా ఉంచడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. అంతకుముందు మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి దంపతులు, అదేవిధంగా మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం, సర్పంచులు అఖిల్, భాస్కర్ గౌడ్, కేశంపేట సీనియర్ నాయకుడు శ్రీధర్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు కేశంపేట మండలం సంబంధించిన వినతి పత్రాన్ని సమర్పించారు అయితే ఎమ్మెల్యే ముందుగానే ఈ సమస్యకు పరిష్కారం చేయడం విశేషం. తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి తమ మనసులో ఉన్న సమస్యను తాము అడగకముందే తీర్చి ఊరట కలిగించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల, శ్రవణ్ రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. కేశంపేట మండలం ఆమనగల్ ఏసిపి పరిధిలోకి వెళుతుందన్న వార్త ప్రచారంలోకి రావడంతో దీనివల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ ప్రయత్నాన్ని ఆపాలని చెప్పేందుకు వారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలుసుకున్నారు. అయితే అంతకుముందే ఎమ్మెల్యే పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు చెప్పడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే శంకర్ తాండ్ర విశాల, శ్రవణ్ రెడ్డి దంపతులను శాలువాతో సత్కరించారు. అలాగే మీడియా ప్రతినిధులు కూడా వారిని శాలువాలతో సత్కరించి వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రమాదం జరిగిన తొలి గంట కీలకం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు 7రోజుల వరకు నగదు రహిత ఉచిత వైద్య చికిత్స అందించటం జరుగుతుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ,ప్రైవేట్ ఆసుపత్రిలకు తరలించి గోల్డన్ అవర్‌లో చికిత్స అందించి ప్రాణాలను కాపాడటమే ప్రధాన లక్ష్యమని అన్నారు. జిల్లా ఆర్టీఏ కమిటీ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. హకీంపేట్, తూంకుంట బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి ఈఈ శ్రీనివాసమూర్తి, పోలీస్, ట్రాఫిక్, అధికారులు, నేషనల్ హైవే, వైద్య, విద్య, టిజిఆర్టీసి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దాడికేసులో 10మందికి రిమాండ్

**పూడూరు, డిసెంబరు 31. ప్రభాతవార్త :** రాజకీయకక్షలతో ఓ వర్గంవ్యక్తిపై మరోవర్గం వ్యక్తి కత్తితో దాడిచేసి హత్యాయత్నం చేసిన ఘటనలో పదిమందిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వికారాబాద్‌జిల్లా పూడూరు మండలం పరిధిలోని కండ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్‌ఐ భరత్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన ఎండి హకీమ్‌తన సోదరుడు ఎండి మోహిన్‌తో కలిసి మంగళవారం రాత్రి సుమారు 10గంటల ప్రాంతంలో హైద్రాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న చాయ్‌బంక్ కేఫ్‌లోఉన్నారు. అదే సమయంలో అదేగ్రామానికి చెందిన నాంచేరి శంకర్ అనేవ్యక్తి అక్కడికి వచ్చి చాయ్‌బంక్ కౌంటర్ వద్దఉన్న హకీమ్‌ను బయటకు పిలిచి చాకుతో దాడీచేసి హత్యచేసేందుకు యత్నించగా, హకీంమ్ చాతిపై తీవ్రగాయాలు కాగా, శంకర్ అక్కడినుండి పారిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన పలువురు గ్రామస్తులు హకీంను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే గత పంచాయతీ ఎన్నికల్లో తాము సర్పంచ్‌గా ప్రతిపాదించిన అభ్యర్థి చింతకింది శివలీలకు హకీమ్ కుటుంబం మద్దత్తు ఇవ్వకపోవడంతోనే పరాజయం పొందామన్న కక్షతో అదేగ్రామానికి చెందిన ఎస్ శ్రీనివాస్, కంకంటి రాజు, నాంచేరి రమేష్,ఉప్పరి శేఖర్, పాశం మల్లయ్య, ఆలూరి అనీల్‌కుమార్, పరిగి వెంకటేష్, కిష్టపురం బుగ్గరాములు, మేకల నర్సన్నలు హకీమ్‌ను చంపేందుకు శంకర్‌ను ప్రోత్సహించినట్లు వివరించారు. బాదితుడు హకీం సోదరుడు ఎండి మోహిన్ పిర్యాదుమేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని పైన పేర్కొన్న పదిమంది నిందితులను బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరళించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఘనంగా మహా పడిపూజ అరాట్ ఉత్సవం...

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబరు 31, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ఆలయ చైర్మన్ వద్దేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల పూజా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం హరిహరపుత్ర శ్రీ అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తి విగ్రహానికి ఆరాట్ ఉత్సవం ఘనంగా నిర్వహించి పడి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా పడిపూజ కార్యక్రమంతో పాటు 18 కలశాల పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్, బిజెపి సీనియర్ నాయకులు కార్పొరేటర్లు పెద్ద ఎత్తున భక్తులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులందరూ మహా పడి పూజలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించడంతో పాటు అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాజేందర్ విక్రమ్ పదవీ విరమణ

**చార్మినార్,డిసెంబరు 31 ప్రభాతవార్త :** డిఆర్‌డిఓలో దాదాపు ముప్పై సంవత్సరాలు పాటు మాస్టర్ టెక్నీషీయన్‌గా విధులు నిర్వహించిన పాతబస్తీకి చెందిన జి.రాజేందర్ విక్రమ్ బుధవారం పదవీ విరమణ చేశారు.డిఆర్‌డిఓలో జరిగిన కార్యక్రమంలో జిఎం ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు కలిసి పదవీ విరమణ చేసిన రాజేందర్ విక్రమ్‌ను శాలువ కప్పి సన్మానంచారు.



తుమ్మలతో ఎమ్మెల్యే చర్చిస్తున్న దృశ్యం

## తుమ్మలతో ఎమ్మెల్యే భేటీ

**తాండూరు, డిసెంబరు 31, ప్రభాతవార్త :** వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. తాండూరు మార్కెట్ యార్డు నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని కోరారు. యలాల మండలం పరిధిలో నిర్మిస్తున్న నూతన యార్డుకు నిధులు ఉన్నందున నిర్మాణాలు వేగమంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## షాద్ నగర్ అసెంబ్లీకి హైమాస్ట్ కాంతులు..

**19 హైమాస్ లైట్లు మంజూరు చేసిన ఎంపిడికె అరుణ**

**షాద్‌నగర్ బిజెపి ఇన్చార్జ్ అందే బాబయ్య హర్షం**

**షాద్‌నగర్, డిసెంబరు 31, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గానికి హైమాస్ కాంతులను అందజేస్తూ మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డికె అరుణ 19 హైమాస్ లైట్లు మంజూరు చేయించారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ అందే బాబయ్య ఈ విషయాన్ని తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఫరూక్ నగర్, కొందుర్గు, చౌదరిగుడా, కేశంపేట, మండలాలలో గ్రామీణ ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేయించేందుకు మెటీరియల్ పంపించడం జరిగిందని ఆయన వివరించారు. మన అందరి ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులతో గ్రామీణ ప్రాంతాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధితో దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని, బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రపంచంలో భారతదేశం మేటి దేశంగా ఆవిర్భవించిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



అందే బాబయ్య

## స్వామి శరణం అయ్యప్ప.. అంజన్నే కావాలప్ప..

**అంజన్న మళ్లీ గెలవాలని కోరుతూ కార్యకర్త శబరి యాత్ర**

**షాద్‌నగర్, డిసెంబరు 31, ప్రభాతవార్త :** స్వామి శరణం అయ్యప్ప.. అంజన్నే మళ్లీ కావాలప్ప.. ఎమ్మెల్యేగా గెలవాలప్ప.. అంటూ ఓ అభిమాని శబరిమల యాత్రకు బయలుదేరాడు. ఫరూక్ నగర్ మం డలం మొగలిగిద్ద గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త బాబు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు వీరాభిమాని. తమ నేత ఓడిపోవడంతో ఆందోళన చెందిన ఆయన వచ్చేఎన్నికల్లో నైనా తమనేత ఘనవిజయం సాధించాలని కోరుతూ శబరిమల యాత్ర మొదలు పెట్టాడు. అంజన్న ఉంటేనే గ్రామీణ ప్రాంతాలఅభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తంగడపల్లి శ్రీను, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అంజన్న ఎమ్మెల్యే కావాలని బ్యానర్ ప్రదర్శిస్తున్న అయ్యప్ప భక్తుడు

## దర్గాలో ప్రత్యేక ఫాతేహాలకు హాజరుకండి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆహ్వానించిన జెపి దర్గా ముజావర్లు**

**షాద్‌నగర్, డిసెంబరు 31, ప్రభాతవార్త :** హజరత్ జహంగీర్ పీర్ దర్గాలో రేపు ముజావర్ల ఆధ్వర్యంలో చేపట్టబోయే ప్రత్యేక జెరా ఫాతేహా ప్రార్థన కార్యక్రమాలకు హాజరు కావాలని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌ను దర్గా ముజావర్లు ఆహ్వానించారు. బుధవారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను స్థానిక ముజావర్లు కలుసుకొని ఆహ్వాన పత్రికను అందజేశారు. రేపు ఉదయం 9 గంటలకు ప్రారంభమై ప్రత్యేక ప్రార్థనలకు హాజరుకావాలని వారు ఆహ్వానించారు. దర్గాలో ఏడాది చేపట్టబోయే ఉరుసుకుముందు ఈ కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీ సంప్రదాయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ నేతలు మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మహమ్మద్ ఇబ్రహీం ఖదీర్ ముబారక్ తదితరులను కూడా వారు ఆహ్వానించారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మైనార్టీలు

## ఆదర్శ దంపతులుగా వర్ధిల్లండి

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**షాద్‌నగర్, డిసెంబరు 31, ప్రభాతవార్త :** తమ జీవితంలో ఆదర్శ దంపతులుగా వర్ధిల్లుతూ ఇతరులకు ఆదర్శప్రాయులుగా జీవించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి దంపతుల 21వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు. వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లప్పుడు అన్యోన్యంగా ఆయురారోగ్యాలతో జీవించాలని ఎమ్మెల్యే వారిని అభినందించారు. ఈ సందర్భంగా దంపతులు ఇరువురు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా స్థానిక జర్నలిస్టు కె.పి, పార్టీ నాయకులు కృష్ణారెడ్డి సీనియర్ జర్నలిస్టులు రాఘవేందర్ గౌడ్ శరత్ తదితరులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అన్నదాన ప్రభువే శరణం

**శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో స్వాములకు అన్నవితరణ కార్యక్రమం**

**హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి**

**షాద్‌నగర్, డిసెంబరు 31, ప్రభాతవార్త :** కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి దంపతుల 21వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని శ్రీ శివ మారుతీ గీత అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజ కార్య క్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రన్మమ ఏర్పాటు చేశారు. ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీ శివ మారుతీ గీతా దేవాలయం అధ్యక్షులు లష్కర్ ఆంజ నేయలు, ప్రతాప్ రెడ్డి, రాయికల్ శ్రీను, శ్రీదర్ రెడ్డి, జంగ నర్సింహులు, రేటికల్ నందీశ్వర్, అనసూయమ్మ, దాస కృష్ణయ్య, వెంకటేష్ గౌడ్ స్వామి, కోటిలింగం గౌడ్ స్వామి, మార్గం రాజేష్, గోలేపు రాఘువేందర్, తొండుపల్లి శ్రీ చరణ్ రెడ్డి, దిలీప్, గంగమోని సత్తయ్య, శ్రీధర్ రెడ్డి, నవీన్, రమేష్, మహేష్ గౌడ్, ప్రకాష్ చారి, తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి దంపతులు

### రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ....

# గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు పని చేయాలి

..పార్టీలో ఉంటూ వెన్ను పోటు పొడిచే వారి పట్ల అప్రమత్తంగ ఉండాలి
..పార్టీలో ఎవరు తోపులు కాదు, పార్టీ టికెట్ కార్యకర్తల అభిప్రాయాల మేరకు కేటాయింపులు
..మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్
..కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న జిల్లా, రాష్ట్ర పార్టీ నాయకులు



మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, పాల్గొన్న మాజీ డిసిసి హరివర్ధన్‌రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డి, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 31, ప్రభాతవార్త :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని, పార్టీలో ఉంటూ వెన్నుపోటు పొడిచే వారి పట్ల పోటీ చేసే నాయకులు అప్రమత్తంగ ఉండాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే నాయకులకు పార్టీ కార్యకర్తల అభిప్రాయాల మేరకు టికెట్ల కేటాయింపులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌లోని సంగీత పంక్షన్‌హాల్‌లో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ విస్తృత పధాధికారుల,కార్యకర్తల సమావేశం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్బంగ పాల్గొన్న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ త్వరలో మున్సిపల్ ఎన్నికలు రానున్నట్లు, ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు ఉంటే తొలగించేలా అభ్యంతరాలు తెలుపాలని, కొత్త ఓటర్లను చేర్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు అందరి సమిష్టిగా కృషి చేయాలని, ప్రజల్లో ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. ఇక పార్టీని బలోపేతం చేస్తూ, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలన్నారు. మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తం కావాలని ఆయన పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వెన్నుపోటు పొడిచిన విషయం తెలిసిందేనని వచ్చె మున్సిపల్ ఎన్నికల్లోనూ మీరు వెన్నుపోటుదారులతో మోసపోవద్దని, అప్రమత్తంగ ఉండాలని సూచించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గత ఎన్నికల్లో డబ్బులు పంచి గెలిచారని ఆయన ఆరోపించారు. ఈ సారి డబ్బులు పంచినా ఓటర్లు తీసుకునే పరిస్థితిలో ఉండరని నాయకులు మాత్రం ఎత్తుకు పైఎత్తుగ ఉండాలని కాంగ్రెస్ నాయకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రజల్లో ఉండి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. ఎవరికి ఎవరు తోపు కాదని నాయకులకు పార్టీ గుర్తింపే కీలకమన్నారు. డిసిసి మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తాను మూడుచింతలపల్లి మండలానికి జడ్పీటిసిగా పనిచేశానని, తనకు సంబంధాలు ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుపకపోవటం పట్ల పరోక్షంగ అసహనం వ్యక్తం చేశారు. ఏ నాయకుడు తోపు కాదని టికెట్ల కోసం నాయకుల వద్దకు వెళ్లవద్దని, పార్టీకి పనిచేసిన వారికే టికెట్ వస్తుందని అన్నారు. పార్టీ కీలక నాయకులు పరోక్షంగ ప్రసంగాలు చేయటం పార్టీ నాయకులు బిత్తరపోయారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ వారికే టికెట్లు వస్తాయని, ప్రజల్లో ఉండే నాయకులను కార్యకర్తల అభిప్రాయాల మేరకు టికెట్లు పార్టీ ఇవ్వటం జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకవెళ్లాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా పార్టీ నాయకులు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి అధ్యక్షులు డి.వెంకటేశ, గుండ్లపోచంపల్లి మున్సిపల్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు జి.మహేందర్‌రెడ్డి, ఎం.మహేందర్‌యాదవ్, మేడ్చల్ ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు కె.కృష్ణారెడ్డి, ఎం.సుదాకర్‌రెడ్డి, సిహెచ్ నర్సింగ్‌రావు, నవీన్‌రెడ్డి,బి.రాంరెడ్డి, ఎల మల్లేశ్, నర్మద, ఎస్.అశోక్‌రెడ్డి, మేడి మల్లేశ్, రమేశ్, అర్జున్‌గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**దోమ,డిసెంబరు 31, ప్రభాతవార్త:** రైతులు పండించిన వడ్లను కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన దాన్యంను వెంటనే తూకం వేసి రైస్‌మిల్లర్లకు పంపించాలని వికారాబాద్‌జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి అన్నారు.బుధ వారం నాడు దోమ మండల పరిదిలోని దిర్సంపల్లి గ్రామములో వరిదాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్బముగ దాన్యంను సక్రమంగా తూకం వేయాలని వెంటనే టాకింగ్‌వేసి రైస్‌మిల్లర్లకు పంపి ధాన్యంకు సంబందించిన బిల్లలు చేయాలని ఆదేశించారు.ట్యాబ్‌ఎంట్రి సత్వరంగాపూర్తిచేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవిదంగా చూడాలని తెలిపారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వరి దాన్యం గొనుగోల్లు జరుపాలని సూచించారు.రైతులు పండించిన వరిదాన్యం నాణ్యతతో తోసుకురావాలని అప్పుడే నాణ్యతతో బియ్యం వస్తాయని దీనివల్ల రైస్‌మిల్లర్లు నష్టపోరని తెలిపారు.ఈ కార్యక్రమములో డిఎంసిఎస్ మురళికృష్ణ,డిఎస్ఓ సుదర్శన్,రైతులు పాల్గొన్నారు.



వడ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాజేశ్వరి

# తాండాకు బోరువేయించిన నూతన సర్పంచ్



రైటప్.బోరు వేయిస్తున్న సర్పంచ్ ముచ్చందర్‌రెడ్డి.

**దోమ,డిసెంబర్ 31, ప్రభాతవార్త:** తాండాలో ప్రజలు తాగునీరు ఇబ్బందులు పడుతున్నందున కొత్తగాఎన్నికైన సర్పంచ్ బోరు వేయించారు.తాండా ప్రజలు గుర్తించి సర్పంచ్‌గా గెలిపించినందున వారికష్టసుఖాలు తెలుసుకొని బోరువేసేందుకు ముందుకు వచ్చాడు.సర్పంచ్‌గా గెలిచి ప్రజలకు సేవ చేయాలనే వచ్చిన యువసర్పంచ్‌ను గ్రామ ప్రజలు అభినంది స్తున్నారు.వివరాల్లోకి వెళ్ళితే మండల పరిధిలోని రాకొండ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ముచ్చందర్‌రెడ్డి గెలుపొందాడు.ఎన్నికల సమయములోరాకొండ తాండా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తాండాలో మంచినీటి సమస్య పరిష్కరిస్తానని హామి ఇవ్వడంతో బుదవారం నాడు తాండాలో బోర్ వేయాడు.దింతో బోర్‌లో నీరు పుష్కలంగా పడటంతో తాగునీటి సమస్య తీరిందని తాండా ప్రజలు తెలిపారు. ఈవిషయంపై తాండా ప్రజలుసంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమములో మాజిసర్పంచ్ వెంకటయ్య, గురునాథ్‌రెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు.

# బుగ్గోనిగూడలో సర్పంచ్ అన్నదాన వితరణ

**నందిగామ, 31 డిసెంబరు ,ప్రభాతవార్త :** నందిగామ మండలం బుగ్గోనిగూడలో శ్రీ కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సర్పంచ్ బుగ్గ సాలయ్య ఆధ్వర్యంలో స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. అంతకు ముందు గురుస్వామి శేఖర్ కరకమలములచే ఇరుముడులు వేశారు. ఆధ్యతం ఆలయ ప్రాంగణం స్వాముల శరణు ఘోషతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుగ్గ బేబీ అనిల్, వార్డ్ మెంబర్లు బుగ్గ రమేష్, శివరాజ్, బుగ్గ ప్రభాకర్, బుగ్గ భాస్కర్, నాయకులు బుగ్గ నరసింహులు, బుగ్గ కుమార్, బుగ్గ అంజయ్య, బుగ్గ నరేష్, గూళ్ల ర్నాచంద్రయ్య, బుగ్గ యాదయ్య, బుగ్గ శ్రవణ్, బుగ్గ శంకర్, బుగ్గ నర్సింలు, శ్రీను తదితరులు ఉన్నారు.

# శామీర్‌పేట తహసీల్దార్‌గా సుచరిత బాధ్యతల స్వీకరణ

**శామీర్‌పేట, డిసెంబరు 31, ప్రభాతవార్త :**
శామీర్‌పేట మండల నూతన తహసీల్దార్‌గా సుచరిత బాధ్యతలు స్వీకరించారు.
బుధవారం ఈ సందర్బంగా జిల్లా మహిళా అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి,పలువురు మహిళలు కలిసి ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. గతంలో మూడుచింతలపల్లి మండల తహసీల్దార్‌గా సుచరిత విధులు నిర్వహించటం, ఆ తరువాత కలెక్టరేట్‌లో విధులు నిర్వహించి శామీర్‌పేట మండల తహసీల్దార్‌గ ఆమె విచ్చేసి బాధ్యతలు చేపట్టారు. శామీర్‌పేట మండల తహసీల్దార్‌గ పనిచేసిన యాదగిరిరెడ్డి కీసర తహసీల్దార్‌గా బదిలీ వెళ్లటంతో కొన్ని నెలల పాటు శామీర్‌పేట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సంయుక్త బాధ్యతలు నిర్వహించటం జరిగింది. మండల తహసీల్దార్‌గా సుచరిత బాధ్యతలు చేపట్టటంతో ఇక డిప్యూటీ తహసీల్దార్‌గా సంయుక్త యధావిధిగా కొనసాగుతున్నారు. అదే విధంగా నూతన సంవత్సరంకు స్వాగతం పలుకుతూ తహసీల్దార్‌తో కేక్‌ను మహిళలు కట్‌చేయించి నూతన సంవత్సర శుభాకాంక్షలు ముందుగానే తెలుపుకున్నారు.



శామీర్‌పేట మండల నూతన తహసీల్దార్‌గా సుచరిత బాధ్యతలు చేపట్టటంతో అభినందించిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి,పాల్గొన్న తదితరుల దృశ్యం

# ప్రతి గ్రామ పంచాయతీలో నరేంద్రమోడి చిత్రపటం తప్పని సరి

**బిజెపి మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్**

**కుల్కచర్ల ,డిసెంబరు 31, ప్రభాతవార్త:** ప్రతి గ్రామ పంచాయతీలో రాష్ట్రపతి దౌపది ముర్మ,ప్రధాన నరేంద్రమోదీ చిత్రపటాలను తప్పని సరిగా ఏర్పాటు చేయాలని బిజెపి మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ చంద్రభూపాల్ రావుకు రాష్ట్రపతి దౌపది ముర్మ,ప్రధాన నరేంద్రమోదీ చిత్రపటాలను అందజేశారు.ఈ సందర్బంగా బిజెపి మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం 85 శాతం పైగా నిధులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రతి మనిషికి కేంద్రం, ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమాలు అందజేస్తుందన్నారు. తప్పని సరిగా ప్రతి గ్రామ పంచాతీలో రాష్ట్రపతి దౌపది ముర్మ,ప్రధాన నరేంద్రమోదీ చిత్రపటాలనుఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యమ్రకంలో సినియక్ రాయకులు మోనాచారి, ప్రధాన కార్యదర్శి నరేష్, బిచ్చయ్య, భీమయ్య, సంతోష్, శివ, శంఖర్, మల్లేష్, రాము, నవీణ్,బాలు,బందయ్య, తదితరులు పాల్గొన్నారు.





లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## పేదింటి ఆడబిడ్డ పెళ్లిళ్లకు కొండంత అండ కళ్యాణ లక్ష్మి

**-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కేశంపేట, డిసెంబరు 31, ప్రభాత వార్త:** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి ్మ షాదీ ముబారక్ కొండంత అండ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేశంపేట మండల పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి ్మ, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పిల్లల వివాహాల కోసం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఈ చెక్కుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. పేదింటి ఆడపడుచులకు ఈ సందర్భంగా ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం నిరంతరప్రక్రియగా కొనసాగుతుందని అన్నారు. కేశంపేట మండలంలో 55 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం, జగదీశ్వరప్ప, కోడూరు రాములు, కోడూరు నర్సింలు, తైద పర్వతాలు, శ్రీధర్ రెడ్డి, బొజ్జం శ్రీశైలం యాదవ్, ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## అయిల్ ట్యాంకర్ లారీ ఢీకొని ప్రైవేటు ఉద్యోగి మృతి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 31, ప్రభాత వార్త:** మోటార్‌సైకిలిస్టును అయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా ఒకరు మృతి చెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జోడిమెట్ల ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం డివిజన్ వెంకటాపూర్ తెనుగుగూడెంకు చెందిన ఈగ మహేశ్ ( 42 ) జోడిమెట్ల చౌరాస్తాలో గల మేధా కంపెనీలో ఎలక్టానిక్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం ఉద్యోగ నిమిత్తం తన హోండాయాక్టీవ్ స్కూటీ ( టీఎస్ 10 ఈఈ 4134 )పై జోడిమెట్ల చౌరాస్తాలో గల మేధాకంపెనీకి బయలుదేరాడు. జోడిమెట్ల చౌరాస్తా వద్దకు రాగానే వెనుక నుండి ఉప్పల్ నుండి ఘట్‌కేసర్ వైపు ప్రయాణిస్తున్న అయిల్ ట్యాంకర్ లారీ ( ఎపి 16 టీహెచ్ 9411 ) ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిలిస్టు మహేశ్ తలకు బలమైన గాయాలై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. దీంతో స్థానికులు బాధితుడ్ని అంబులెన్స్‌లోకి ఎక్కించి స్థానిక నీలిమ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కొరకు సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు బాధితుడ్ని పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన అయిల్ ట్యాంకర్ డ్రైవర్ డబ్యూ. ఆంజనేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం. శివకృష్ణ తెలిపారు.



బి ఆర్ ఎస్ లోచేరుతున్న పెద్దూర్ తండ సర్పంచ్ శ్రీను నాయక్

## అభివృద్ధిని చూసి ఆకర్షితులయ్యాం

**వెంకటేష్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్‌లో చేరిన**

**పెద్దూర్ తండా సర్పంచ్ శ్రీను నాయక్**

**తలకొండపల్లి, డిసెంబరు 31, ప్రభాత వార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని పెద్దూర్ తండ గ్రామ సర్పంచ్ శ్రీను నాయక్ బుధవారం మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మెన్,తలకొండపల్లి మాజీ జెడ్పీ టి సి ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ లోచేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అందరుకలసికట్టుగా ఉండి సహకరించుకోవాలని సూచించారు.
సర్పంచ్ శ్రీను నాయక్ మాట్లాడుతూ పార్టీలో చేరడానికి ముఖ్య కారణం చేసిన అభివృద్ధిని చూసి ఆకర్షతులై వెంకటేష్ చేసిన సేవలకు గుర్థిస్తూ పార్టీ లో చేరుతున్నాను పార్టీలకు అతీతంగా గ్రామఅభివృద్ధి చేస్తా అని సర్పంచ్ శ్రీను నాయక్ తెలిపారు .పార్టీలో చేరిన వారు గ్రామ పెద్దలు టిక్య నాయక్ తర్య నాయక్ రమేష్ నాయక్ కిషన్ నాయక్ రవి నాయక్ గ్రామ యువకులు మల్లేష్ మహేష్ౢ మల్లేష్ౣ నర్సిమ భాస్కర్ కళ్యాణ్ ప్రవీణ్ వినోద్ రాజ్ కుమార్ బిచ్చ రవి నర్సిమా భీమా రాజెందర్ శ్రీను



బుతుకమ్మ చీరాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కవిత రాజు

## గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తాం

**సర్పంచ్ కవిత రాజు**

**కుల్కచర్ల, డిసెంబరు 31, ప్రభాతవార్త:** గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని సర్పంచ్ కవిత రాజు నాయక్ అన్నారు.బుధవారం మండల పరిధిలోని దశ్యనాయక్ తాండ గ్రామాపంచాయతీలో మహిళలకు ఇందిరమ్మ చీరెలు పంపిణీ చేశారు. అనంతరం తాండలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళ సంఘంలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ శంకర్ నాయక్, రాజు,సిసి మంజుల, మాని బాయి,విఓఏ కవిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## తండాలో వీధి పని ఏర్పాటు

**జిల్లేడు చౌదరి గూడెం, డిసెంబరు 31, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగుడా మండలంలోని ధర్మే తండా గ్రామ పంచాయతీలో గల ఏడు తండాలలో సర్పంచ్ చందు నాయక్ వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. గత కొంత కాలంగా తండాలలో సరైన మోలిక సదుపాయాలు లేక తాండవాసులు ఇబ్బంది పడుతున్నట్లు గమనించిన సర్పంచ్ మొదటగా వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజులు తండాల అభివృద్ధి కోసం అనేక పనులు చేయనున్నట్లు పేర్కొ న్నారు. ఈ కార్య క్రమంలో ఉపసర్పంచ్ రాజు నాయక్, డీలర్ పీరే నాయక్, మంధ్యా నాయక్, అనిల్ జమున బాయి, శంకర్ పెం టమ్మ, శివ మోహన్, రాజు బాబు, రమేష్ శరన్ హనుమంతు, రెడ్యా పాల్గొన్నారు.



తండాలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ చందు నాయక్